క్లుప్తంగా

రాకమకొండ స్వామి వార్షికోత్సవం

హకీంపేట్‌లో భక్తి పరవశం



ఉత్సవ మూర్తుల కల్యాణం

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో శ్రీ రాకమకొండ స్వామి 15వ వార్షికోత్సవం ఘనంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా స్వామి వారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆలయ ధర్మకర్త రాకం యాదయ్య పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం, ఊరేగింపు, చక్ర స్నానం చేపట్టారు. దీంతో గ్రామంలో భక్తి పరవశం అలుముకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి రాకం అరుణమ్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరమని కాంగ్రెస్ మండల నాయకులు కడుమూరి రాంరెడ్డి, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్ పేర్కొన్నారు. కుల్కచర్ల గ్రామానికి చెందిన భైరం నవీన్ కొన్ని నెలల క్రితం అనారోగ్యానికి గురై ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. శనివారం బాధిత కుటుంబానికి మంజూరైన రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల పార్టీ అని అన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగారి రవి, బుక్క జావీద్, భైరం మహిపాల్, లొద్ద గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ మృతి బాధాకరం



ఏన్కతల శనైశ్చరస్వామి పూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

మోమిన్‌పేట: ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో పాక్ జరిపిన కాల్పుల్లో భారత వీర జవాన్ మృతి చెందడం బాధాకరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఏన్కతల శనైశ్చరస్వామిని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డితో కలిసి దర్శించుకొని పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం తరఫున ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన జవాన్ మురళీనాయక్ యుద్ధంలో పాల్గొని వీర మరణం పొందాడని, ఆయన త్యాగం వృథాకాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న స్థానిక నాయకులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన చెంచు రాములు ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి శనివారం స్థానిక నాయకులతో కలిసి రూ.5వేల తక్షణ ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. చెంచు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేయనున్నట్లు తెలిపారు. నిరుపేదలకు తోడునీడగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, చెంచు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాథమిక శిక్షవర్గ కార్యక్రమం ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమవుతుందని విభాగ్ సహ కార్యవాహ అనంతరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తరగతి ఆపై చదువుతున్న విద్యార్థులు, యువకులు ఎవరైనా ఈ శిక్షణ కార్యక్రమంలో హాజరు కావచ్చని తెలిపారు.

ఇంటికే అంగన్‌వాడీ సరుకులు

- 15 రోజులు టీచర్, 15 రోజులు ఆయా పంపిణీ
- పర్యవేక్షిస్తున్న అధికారులు



బాలింతలు, గర్భిణులకు సరుకులు పంపిణీ చేస్తున్న టీచర్

దౌల్తాబాద్: రోజు రోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఉదయం ఏడుగంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈ ఎండల తీవ్రత ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులతో పాటు గర్భిణులు బాలింతలపై ఎక్కువ ప్రభావం చూపనుంది. దీంతో అంగన్‌వాడీ చిన్నారులకు నెల రోజుల పాటు సెలవులు ప్రకటిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సెలవుల్లో సైతం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహార లోపం తలెత్తకూడదనే భావనతో ప్రభుత్వం నేరుగా సరుకులను లబ్ధిదారుల ఇంటికి పంపిణీ చేయనుంది. ప్రతీ ఒక్కరికి పోషకాహారం అందించాలనే లక్ష్యంతో గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అన్నం, పప్పు గుడ్లను లబ్ధిదారులకు వడ్డించేవారు. ప్రభుత్వం నెలరోజుల పాటు పిల్లలకు సెలవులు ప్రకటించడంతో పోషకాహార పంపిణీలో ఇబ్బందులు ఎదుర్కోవద్దని వండిన భోజనం కాకుండా వంటసామగ్రిని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇందుకుగాను అంగన్‌వాడీ కేంద్రాల్లో (మే నెల మొత్తం) మొదటి 15 రోజులు టీచర్, మిగిలిన 15 రోజులు ఆయా అందుబాటులో ఉండి బియ్యం పప్పు, నూనె, బాలామృతం గుడ్లు అందజేస్తారు.

మండలంలో 68 కేంద్రాలు

మండలంలో రెండు సెక్టార్లలో 68 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 339 మంది గర్భిణులు, 211 మంది బాలింతలు, 0నుంచి 6 నెలల పిల్లలు 211, 7నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు 1,337, మూడేళ్ల నుంచి 6 సంవత్సరాల పిల్లలు 1,224 మంది ఉన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు 75గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనె, 20గ్రాముల మురుకులు రోజుకు ఒక గుడ్డు అందిస్తారు. అలాగే 7నెలల నుంచి మూడేళ్ల పిల్లలకు నెలకు 16 కోడిగుడ్లు బాలామృతం అందిస్తారు. ఇక బాలింతలు, గర్భిణులకు 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పు, 16 గ్రాముల నూనెతో పాటు పాలు, రోజుకు ఒకగుడ్డు ఇస్తున్నారు. ఆయా కేంద్రాల్లో అందిస్తున్న సరుకులను వృథా చేయకుండా వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

పర్యవేక్షిస్తున్నాం

వేసవి దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట సరుకులను పంపిణీ చేస్తున్నాం. నిత్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు అందుబాటులో ఉంటున్నారు. పంపిణీ కార్యక్రమం సవ్యంగా నిర్వహించేలా నిత్యం ఆయా కేంద్రాలను పర్యవేక్షిస్తున్నాం.

– మంజుల, సూపర్‌వైజర్, ఐసీడీఎస్

పాంబండ దేవస్థానం అభివృద్ధికి కృషి

ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి



కోనేరు పూడిక పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి

కుల్కచర్ల: పాంబండ దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో సిద్ధి రామప్ప ఆలయం ఎదుట కోనేరులో పూడికతీత పనులను పూర్తిచేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నో ఏళ్లుగా మట్టి, చెత్తా, చెదారంతో పూడుకుపోయిన కోనేరును మళ్లి ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు పనులు చేయిస్తున్నామన్నారు. ఆలయంలో నిర్వహించే పూజాధికార్యక్రమాలకు ఈ నీటిని ఉపయోగించడానికి, అందరి సలహాలు తీసుకొని ఆలయ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిధులతో అభివృద్ధి పనులు

పూడూరు: రాకంచర్ల శ్రీ యోగానందా లక్ష్మినర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.70 లక్షల ఎమ్మెల్యే నిధులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు డీసీసీ కార్యదర్శి పెంటయ్య తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్లు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. త్వరిత గతినా ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. నేటితో ప్రారంభం కానున్న రాకంచర్ల యోగానంద లక్ష్మినర్సింహస్వామి ఉత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

15న వీరారెడ్డిపల్లిలో జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలో వీరారెడ్డిపల్లి గ్రామ శివారులోని వీరభద్రేశ్వర స్వామి జాతర ఈ నెల14, 15వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం స్వామివారికి అభిషేకం, కలశపూజ నిర్వహిస్తారన్నారు. 15వ తేదీన అగ్నిగుండం, రథోత్సవం ఉంటుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

చెరువుల్లో పూడిక తొలగించాలి

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో చెట్లు, మట్టితో నిండుకున్న చెరువుల్లో పూడికను తొలగించాలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులను మత్స్యకారులు కోరారు. గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయలో భాగంగా పలు చెరువుల్లో పూడిక తీసినట్లు పేర్కొన్నారు. కాగా మిగిలిన చెరువుల్లో గత కొన్నేళ్ల నుంచి పూడిక తీయని కారణంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందన్నారు. దీంతో చేపల పెంపకంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీరు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

జీటీగా మారుతున్న రహదారులు



కుక్కింద ఎక్స్ రోడ్డు నుంచి గడ్డమీది గంగారం వరకు బీటీ రోడ్డు నిర్మాణం


ధారూరు: మండల పరిధిలోని కుక్కింద ఎక్స్ రోడ్డు నుంచి గడ్డమీది గంగారం గ్రామం వరకు శనివారం రెండున్నర కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్క రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించలేదు. ప్రస్తుతం ప్రభుత్వ హయాంలో ముందుగా మోమిన్‌ఖుర్దు నుంచి రాజాపూర్ రోడ్డు, ఆ తర్వాత పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి అల్లిపూర్ వరకు బీటీ నిర్మాణం పూర్తయ్యింది. కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి కుక్కింద ఎక్స్ రోడ్డు వరకు 5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం గ్రామీణ రహదారుల మరమ్మతుల పథకం కింద రూ.2.82 కోట్లు మంజూరయ్యాయి. కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి గడ్డమీది గంగారం వరకు అడవి విస్తరించి ఉండటంతో ఫారెస్టు అధికారులు అభ్యంతరం చెప్పారు. ఎలాంటి అభ్యంతరం లేని కుక్కింద ఎక్స్ రోడ్డు నుంచి గడ్డమీది గంగారం గ్రామం వరకు బీటీ నిర్మాణం పూర్తి చేశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డీఈ శ్రీనివాస్, ఏఈ ప్రణీత్‌లు నిర్మాణ పనులతో పాటు నాణ్యతను పరిశీలిస్తూ ఏక కాలంలో కొలతలు సైతం సేకరించారు. అటవీశాఖ నుంచి అనుమతులు రాగానే మిగిలిన అసంపూర్తి రోడ్డును బీటీగా మారుస్తామని వారు వివరించారు. దాదాపు 30 సంవత్సరాల క్రితమే కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి గడ్డమీది గంగారం వరకు సింగిల్ బీటీ రోడ్డు వేశారని, కొత్త రోడ్డు కానప్పుడు అటవీశాఖ అభ్యంతరం ఏంటని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ పనులు అదనంగా చేస్తేనే అటవీశాఖ అభ్యంతరం చెప్పాల్సి ఉంటుందని, వేసిన రోడ్డుపై బీటీ వేయిస్తే వద్దని వారించడం అధికారుల అనాలోచిత చర్య అని వారు ఆరోపించారు. ఇకనైనా అధికారులు పునరాలోచించి పాత రోడ్డుపై బీటీ వేయించడంలో అభ్యంతరం వ్యక్తం చేయొద్దని వారు హితవు చెప్పారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కొత్తూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో పలు వీధుల్లో ఇళ్లపై నుంచి వేసిన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే ఆయా వీధుల్లో పలువురు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కాగా కిందకు ఉన్న తీగలను సరిచేయాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని వారు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చేవెళ్ల ఇన్‌చార్జి అందె బాబయ్య అన్నారు. మున్సిపాలిటీలో శనివారం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అందె బాబయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ హాజరయ్యారు. ముందుగా పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కొత్తగా మున్సిపాలిటీ ఏర్పాటు కావటంతో మున్సిపాలిటీ పరిధిలో ఒకరు, రూరల్‌కు ఒకరు పార్టీ అధ్యక్షులను ఏర్పాటు చేశామన్నారు. మండల కమిటీలో పదవుల కోసం ఆసక్తి ఉన్నవారి పేర్లను ఈ సమావేశంలో సేకరించారు. వారిలో ఎవరు ఏఏ పదవులకు ఎంపిక చేయాలనే విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ప్రకటిస్తామని వెల్లడించారు. రాబోయే రోజులు బీజేపీయేనని, పార్టీ కోసం పని చేసే వారిని పార్టీ ఎప్పటికీ మరిచిపోదన్నారు. ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు వెంకటేశం, నర్సింహారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కుమార్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు అంజనేయులుగౌడ్, జయశంకర్, ఉమాశంకర్‌రెడ్డి, బర్ల కృష్ణ, ధనుష్‌రెడ్డి, సందీప్, తిరుపతిరెడ్డి, కృష్ణ, మధు, మోహన్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్

- వృథాగా పోతున్న తాగునీరు
- మరమ్మతు పనులు చేపట్టని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



చించోళి మార్గంలో పైపులైన్ పగలడంతో వృథాగా పోతున్న నీరు

తాండూరు టౌన్: అసలే ఎండాకాలం..తాగునీటికి పలు వార్డుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్నా తాగునీటిని చివరి కుళాయి వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంటుంది. నాలుగు రోజులుగా పైపులైన్ పగిలి గంటల తరబడి నీరు వృథా అవుతున్నా, మున్సిపల్ సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని చించోళి రోడ్డు మార్గంలో సెయింట్ మార్క్స్ పాఠశాల సమీపంలో రోడ్డు పనుల కోసం ఇటీవల తవ్వకాలు చేపట్టారు. ఈ తవ్వకాలతో తాగునీటి పైపులైన్ పగిలింది. వరదలా పారుతున్న నీటితో ఆ ప్రాంతంలో ఓ గుంత ఏర్పడింది. చిన్నారులు ఆ గుంత వద్దకు వచ్చి ఆటలాడుతుండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. రోజుల తరబడిగా తాగునీరు రోడ్డు పాలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పగిలిన పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సంగాయిపల్లిలో ఘనంగా బోనాలు

ఆంజనేయ స్వామికి అభిషేకం, పల్లకీ సేవ



బోనాలతో వెళ్తున్న మహిళలు

దుద్యాల్: మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ వార్షిత్సోవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు సంవత్సరాల క్రితం దేవాలయ నిర్మాణం, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలు చేపట్టారు. నేటితో రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకీలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం బొడ్రాయికి మహిళలే బోనాలు సమర్పించారు. దీంతో గ్రామంలో భక్తి పరవశంతో పాటు పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలను మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



చౌడాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: రైతులకు మేలు చేకూర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన చౌడాపూర్‌లో ఏర్పాటుచేయబడిన వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దని రైతుల ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు సెంటర్లలోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీల్యానాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము, స్థానికులు హరిశ్చందర్, మణికంఠ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుపై హర్షం

ధారూరు: మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణ కోసం రూ.98.30 కోట్లు మంజూరు కావడంపై శనివారం ధారూరు మాజీ వైస్ ఎంపీపీ వరద మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. 9,200 ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు దశాబ్దాల కాలం నుంచి ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో కాల్వలు పూర్తిగా శిథిలమై, బుంగలు పడి పాజెక్టు నీరు వృథాగా కాగ్నాలో కలిసి పోతుంది. ప్రతి ఏడాది 5వేల ఎకరాల వరకే సాగునీటికి పరిమితమైంది. తాము ఎన్నోసార్లు పాలకులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఆధునీకరణకు నిధులు మంజూరు కావడంపై రైతుల్లో ఆనందం వెల్లు విరుస్తుందన్నారు. పనులు పూర్తయితే ఏడాదికి రెండు పంటలు సాగుచేసుకునే వీలుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఒకేసారి సాగు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయించాలని ఆయన డిమాండు చేశారు.

భవానీ మాత ఆలయ వార్షికోత్సవం



భవానీమాత ఆలయంలో నిర్వహించిన హోమంలో భక్తులు

మర్పల్లి: మండల పరిధిలోని నర్సాపూర్ తండాలో ఆదివారం భవానీ మాత ఆలయ వార్షికోత్సవాన్ని తండా వాసులు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం నిర్వహించారు. సాయంత్రం బాజా భజంత్రీలతో బోనాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం భవానీ మాతకు నైవేద్యాలు సమర్పించి గ్రామంలో పంటలు బాగా పండాలని ప్రజలు సుఖసంతోశాలతో జీవించాలని గిరిజనులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

రూరల్ సీఐ నగేశ్



తాండూరు రూరల్: గొట్లపల్లి గేటు వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ నగేశ్

తాండూరు రూరల్: మద్యం తాగి వాహనాలు నడపొద్దని తాండూరు రూరల్ సీఐ నగేశ్ సూచించారు. శనివారం పెద్దేముల్ మండల గొట్లపల్లి గేటు వద్ద ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ద్విచక్ర వాహనం నడిపే ప్రయాణికుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతీ వాహనానికి ఇన్సూరెన్స్ చేయించాలని అవగాహన కల్పించారు. త్రిపుల్ రైడింగ్ చేయొద్దన్నారు. కార్లు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనాలను అతివేగంగా నడపొద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, ప్రొబేషనరి ఎస్ఐలు పుష్పలత, నోమన్, కానిస్టేబుళ్లు ఉన్నారు.



నవాబుపేటలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

నవాబుపేట: మద్యం సేవించి ఏ వాహనాన్ని నడిపినా సహించేది లేదని మోమిన్ పేట సీఐ వెంకట్ వాహన దారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని అర్కతల చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపటం వల్లే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తాగిన వారితో పాటు అవతలి వాళ్లు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.